రగులుతున్న నిరుద్యోగులు

- నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోని సర్కారు
- హామీలను విస్మరించి గ్రూప్ 1 ఫలితాలు విడుదల
- భగ్గుమన్న అభ్యర్థులు.. సమరమే అంటూ ప్రతిన
- సర్కారుపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నాహాలు
- త్వరలోనే 'చలో ఢిల్లీ'

టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యువజన, విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు, గ్రూప్స్ అభ్యర్థులు (ఫైల్)

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒకవైపు నిరుద్యోగ యువత పోరుబాటలో ఉంటే, ప్రభుత్వం పంతానికి పోయి తన పని తాను చేసుకుపోతున్నది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే అమలు చేయకుండా మొండివైఖరితో ముందుకు పోతున్నది. తాజాగా గ్రూప్ 1లో 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేస్తుంటే, అనూహ్యంగా 1:50 చొప్పున ఎంపిక చేయడంతో నిరుద్యోగ అభ్యర్థులు భగ్గుమన్నారు. దీంతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రతినబూనారు. ఎన్నికల ముందునాటి కాంగ్రెస్ నేతల వైఖరికి, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి వ్యవహార శైలి విరుద్ధంగా ఉన్నదని ధ్వజమెత్తుతున్నారు. ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డి అందుకు తీసుకుంటున్న వ్యతిరేక నిర్ణయాలే నిదర్శనమని పేర్కొంటున్నారు. ఎన్నికల ముందు నమ్మి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి ఇచ్చిందని వారు కుమిలిపోతున్నారు. ఎన్నికల హామీలనే అమలు చేయాలని వారు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు

ఉద్యోగాల భర్తీ విషయంలో తాము చేస్తున్న డిమాండ్లను పరిశీలించకుండా, తమను చర్చలకు పిలువకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని నిరుద్యోగ యువత మండిపడుతున్నది. గ్రూప్-1 ప్రిలిమినరీ ఫలితాలు 1:50 ప్రకారం విడుదల చేయడానికి బాధ్యుడైన ముఖ్యమంత్రి నిరుద్యోగుల పట్ల తన మొండి వైఖరిని బయటపెట్టుకున్నారని వారు ధ్వజమెత్తుతున్నారు. ఈ ఘటనతో కావాలనే నిరుద్యోగులను సీఎం రెచ్చగొడుతున్నట్టుగా సంకేతాలు కనిపిస్తున్నాయని భావిస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్య పెంచడంపైనా ఆయన మాట మార్చారని, డీఎస్సీలో ఎట్టి పరిస్థితుల్లో పోస్టుల సంఖ్య పెంచే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారని నిరుద్యోగులు మరింత ఆగ్రహానికి గురవుతున్నారు. డీఎస్సీ పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలన్న అంశంపైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు స్పష్టత ఇవ్వలేక పోవడంతోపాటు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నదని నిప్పులు చెరుగుతున్నారు.

కాంగ్రెస్ సర్కారుతో సమరమే..

విద్యార్థులు, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వంతో సమరమేనని నిరుద్యోగులు కుండబద్దలు కొడుతున్నారు. ఇప్పటికే ఆమరణ దీక్షలు, ముట్టడి, ధర్నా కార్యక్రమాలు నిర్వహించినా ప్రభుత్వంలో చలనం రావడం లేదని తెలిపారు. నిరుద్యోగుల తరపున ప్రస్తుతం బక్క జడ్సన్, అశోక్ ఐదు రోజులుగా ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి నుంచి కనీసం ఒక్క సానుకూల ప్రకటన రాలేదని వారు పేర్కొంటున్నారు. తమపై ఈ ప్రభుత్వానికి జాలి కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ఇక నుంచి తమ కార్యాచరణ రూపొందిస్తామని నిరుద్యోగ జేఏసీ స్పష్టం చేసింది.

త్వరలో గవర్నర్‌కు ఫిర్యాదు

నిరుద్యోగుల ఆందోళనలకు దిగిరాని రాష్ట్ర ప్రభుత్వంపై త్వరలోనే రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రంలోని బీఆర్ఎస్ సహా ఇతర ప్రతిపక్షాలు తమకు మద్దతుగా నిలుస్తున్నాయని జేఏసీ నేతలు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుకు ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకను నిలదీయడానికి త్వరలోనే 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యాశాఖ ఆఫీస్ ముట్టడి

డీఎస్సీ పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలన్న డిమాండ్‌తో సోమవారం పాఠశాల విద్యాశాఖను ముట్టడిస్తామని నిరుద్యోగ జేఏసీ నేతలు తెలిపారు. ఈ ముట్టడిలో రాష్ట్ర నలుమూలల నుంచి స్వచ్ఛందంగా పాల్గొనడానికి డీఎస్సీ అభ్యర్థులు హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని చెప్పారు. డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా ఓయూ విద్యార్థి జేఏసీ నేత మోతీలాల్‌నాయక్ సహా పలువురు నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు పాల్గొంటారని ప్రకటించారు.

15న సెక్రటేరియట్ ముట్టడి

- నిరుద్యోగులను వంచించిన సర్కారు
- బీసీలను మోసగించిన కాంగ్రెస్ పార్టీ
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్
- హామీల అమలులో ప్రభుత్వం విఫలం: కృష్ణయ్య

ఖైరతాబాద్, జూలై 7: నిరుద్యోగులను వంచించి, బీసీలను మోసగించిన కాంగ్రెస్ సర్కారు తీరును నిరసిస్తూ ఈ నెల 15న సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు రాజారాంయాదవ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సెక్రటేరియట్ ముట్టడి పోస్టర్లను ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఏల్చల దత్తాత్రేయ, టీ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణతో కలిసి రాజారాంయాదవ్ ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను పెంచుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీలను గుప్పించిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కులగణన చేపట్టకుండానే స్థానిక ఎన్నికలకు పోవాలన్న యోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీని ప్రకటిస్తామని ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నిరుద్యోగులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని గుర్తు చేశారు. గ్రూప్-1 మెయిన్స్‌లో 1:100 నిష్పత్తి ప్రకారం అవకాశం కల్పిస్తామని స్వయంగా అప్పటి ప్రతిపక్ష నేతగా మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదాలో పట్టించుకోవడమే లేదని మండిపడ్డారు. వారిచ్చిన హామీలనే నెరవేర్చాలని కోరుతుంటే విద్యార్థి, నిరుద్యోగులు, బీసీలపై దాడులు చేస్తూ అరెస్టులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజాసంక్షేమాన్ని పక్కనబెట్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కొనుగోళ్లలో సీఎం బీజీగా ఉన్నారని ఆరోపించారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు: రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

నిరుద్యోగ సమస్య, కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య విమర్శించారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, ఎంపీ పదవుల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్న బీసీలకు స్థానిక సంస్థల్లోనైనా ప్రాతినిధ్యం కల్పించరా? అని ప్రశ్నించారు. సమగ్ర కులగణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు నిరుద్యోగులు, విద్యార్థులు, బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతారని హెచ్చరించారు. సమావేశంలో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్, తెలంగాణ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపల్లి రామకోటి, తెలంగాణ బీసీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తిగౌడ్, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు, ఓయూ విద్యార్థి సంఘాల జేఏసీ నేత లింగం శాలివాహన, అంబేద్కర్ యువజన సంఘం జాతీయ నేత కొంగర నరహరి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాం, తీన్మార్ మల్లన్న ఎక్కడ?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటామని, ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని చెప్పిన ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జాడ కనిపించడం లేదని రాజారాంయాదవ్ ధ్వజమెత్తారు. రెండు లక్షల ఉద్యోగాలు, 25 వేల మెగా డీఎస్సీ, గ్రూప్ 2లో 2వేలు, గ్రూప్-3లో 3వేల పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగాల కోసం నిరుద్యోగుల రోడ్డెక్కి, జైళ్ల పాలవుతుంటే వారు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ ఈ నెల 15న నిర్వహించే సెక్రటేరియేట్ ముట్టడికి విద్యార్థి, యువజన, బీసీ కుల సంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

న్యాయవాది కృష్ణప్రసాద్ అరెస్ట్

భద్రాచలం, జూలై 7: భద్రాచలం టైమ్స్ అధినేత, న్యాయవాది కృష్ణప్రసాద్‌ను శుక్రవారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయ సహాయం కోసం వచ్చిన ఓ మహిళపై లైంగికదాడి చేశారనే అభియోగంపై ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కరుడుగట్టిన ఉగ్రవాది లాగా న్యాయవాదికి సంకెళ్లు వేసి తీసుకెళ్లడం దారుణమని భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ చైతన్య పేర్కొన్నారు. సోమవారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

గ్రూప్-1 ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి...

ఏర్పాట్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. పరీక్షలకు వారం ముందు నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలతోపాటు తుది కీని కూడా అధికారులు విడుదల చేశారు. ఆ ప్రశ్నాపత్రంలో తప్పుగా వచ్చిన రెండు ప్రశ్నలను తొలిగించామని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. మరో ప్రశ్నకు రెండు ఆప్షన్లు కూడా కరెక్టు అని ప్రకటించారు.

షార్ట్‌ఫాల్ విధానం అంటే?

గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ కోసం ప్రిలిమినరీ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ షార్ట్‌ఫాల్ విధానాన్ని అమలుచేశారు. తొలుత 563 పోస్టులకు గాను మెరిట్ జాబితాలో 28,150 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేశారు. ఆ తర్వాత మరో 3,232 మందిని కమ్యూనిటీ షార్ట్‌ఫాల్ విధానంలో ఎంపిక చేశారు. అంటే మొత్తంగా 31,382 మంది అభ్యర్థులను మెయిన్ పరీక్షలకు ఎంపిక చేశారు. మెరిట్ జాబితా ప్రకారం కమ్యూనిటీ రిజర్వేషన్ పోస్టుల్లో 1:50 నిష్పత్తికి తక్కువగా ఉంటే అదనంగా అదే కమ్యూనిటీ నుంచి ఎంపిక చేశారు. ఉదాహరణకు ఎస్సీ క్యాటగిరీలో 70 పోస్టులుంటే, 1:50 నిష్పత్తి ప్రకారం లెక్కిస్తారు. మొత్తంగా 3,500 మంది ఎస్సీ అభ్యర్థులకు నేరుగా మెయిన్స్‌కు హాజరయ్యేందుకు అవకాశం వస్తుంది.

'గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల్లో తప్పులు'

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల్లో తప్పులు దొర్లాయని గ్రూప్-1 అభ్యర్థులు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ప్రాథమిక కీలో ఈ తప్పులు వచ్చినా వాటిని టీజీపీఎస్సీ అధికారులు సరిచేసినట్టుగా లేదని పేర్కొన్నారు. ఐదు తప్పులు దొర్లాయని, వాటిని టీజీపీఎస్సీ పరిగణనలోకి తీసుకోలేదని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలను ఒకటి రెండు రోజుల్లో వెల్లడిస్తామని అభ్యర్థులు దేవేందర్, రాకేశ్ తదితరులు తెలిపారు.

సీపీఎస్ రద్దుకు ఉద్యోగుల పోరుబాట!

మొదటిపేజీ తరువాయి...

గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 40 శాతానికిపైగా ఉద్యోగులు సీపీఎస్ విధానంతో నష్టపోతున్నారు. 2004 తర్వాత నియామకమైన వారిని సీపీఎస్ పరిధిలోకి చేర్చారు. దీంతో 2004 తర్వాత నియామకమైన వారంతా పాత పెన్షన్ విధానం కోల్పోయారు. వీరంతా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత ఇదే అంశంపై పలు మార్లు ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులను కలిసినా 'చేస్తాం.. చూస్తాం' అన్న మాటలే కానీ, ఇంతవరకు సీపీఎస్‌ను రద్దుచేసే ప్రయత్నాలేవీ సాగడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఓపిక నశించిన ఉద్యోగులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నారు. జూలైలో ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. తమ తడాఖా చూపిస్తామని హెచ్చరిస్తున్నారు.

సగం వేతనం స్థానంలో..

సీపీఎస్ అనేది కేవలం ఉద్యోగి చందా ఆధారిత స్కీం. ఈ పథకంలో ఉద్యోగుల మూలవేతనం, డీఏల నుంచి ప్రతి నెలా 10% చొప్పున కట్ చేస్తారు. ప్రభుత్వం కూడా మరో 10% చందాను జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని ఎన్‌పీఎస్-ఎన్ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తారు. అక్కడ ఉద్యోగికి పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబర్ (ప్రాన్)లో ఈ మొత్తాన్ని జమచేస్తున్నారు. దీనిని ఎన్ఎస్‌డీఎల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న బ్యాంకులకు బదిలీచేసి, అక్కడినుంచి స్టాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఉద్యోగి రిటైర్ అయిన తర్వాత 60% సొమ్మును చెల్లించి, మిగతా 40% సొమ్మును స్టాక్ మార్కెట్‌లో కొనసాగిస్తూ లాభనష్టాలతో కలిసి ఎంతోకొంత పెన్షన్ రూపంలో చెల్లిస్తారు. షేర్లు నష్టాల్లో కొనసాగితే పెన్షన్ మొత్తం మైనస్‌లోకి పోతుంది. స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులు, షేర్ల పెట్టుబడుల్లో ఉద్యోగులకు ఎలాంటి హక్కులు లేకపోవడంతో రిటైర్ అయిన ఉద్యోగులకు నెలకు రూ.1,800-2,000 పెన్షన్ కూడా అందడం లేదు. దీంతో రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగులకు సామాజిక భద్రత ఉండటంలేదు.

తెచ్చింది కాంగ్రెస్సే..

రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే. 2004లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2004 సెప్టెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సీపీఎస్‌ను వర్తింపజేస్తూ జీవో-653ని జారీచేసింది. ఈ మేరకు ఏపీ పెన్షన్ రూల్స్-1980ని అప్పటి ప్రభుత్వం సవరించింది. ఈ ఒక్క నిర్ణయంతో రాష్ట్రంలోని ఉద్యోగులందరినీ రోడ్డున పడేసింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దుచేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏకంగా అభయహస్తం అంటూ మ్యానిఫెస్టోలో చేర్చింది. కానీ, ఆ దిశగా కనీస చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఈ ఆరు నెలల్లో క్యాబినెట్ సమావేశాలు సహా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కడా సీపీఎస్ రద్దును కనీసం ప్రస్తావించడంలేదంటే ఆ పార్టీ ప్రభుత్వానికి ఈ అంశంపై ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక విచిత్రమేంటంటే రాష్ట్రంలో 2003 డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ద్వారా టీచర్లను నియమించారు. నోటిఫికేషన్‌ను 2003లోనే ఇచ్చినా, ఉద్యోగాలను 2004లో భర్తీచేశారు. వాస్తవానికి నోటిఫికేషన్‌ను ప్రామాణికంగా తీసుకుని సీపీఎస్‌ను అమలుచేయాల్సి ఉండగా, పోస్టింగ్ తేదీ ఆధారంగా సీపీఎస్‌ను అమలుచేయడం ఆయా టీచర్ల పాలిట శాపంగా మారింది. ఇందుకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. తమను సైతం సీపీఎస్ నుంచి మినహాయించాలని 2003 డీఎస్సీ టీచర్లు కోరుతున్నారు.

ఉత్తర భారతానికో రూల్.. దక్షిణ భారతానికో రూల్..

సీపీఎస్ రద్దు నేడు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ఎజెండాగా మారింది. సీపీఎస్ రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ ఉత్తర భారతానికో రూల్, దక్షిణ భారతదేశానికో రూల్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. సీపీఎస్‌ను రద్దుచేస్తామన్న హామీతోనే కాంగ్రెస్ పార్టీ గతంలో రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఇదే హామీనిచ్చింది. కాంగ్రెస్ మిత్రపక్షమైన జేఎంఎం అధికారంలో ఉన్న జార్ఖండ్‌లోనూ ఓపీఎస్‌ను అమలుచేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగులకు పాత పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు సైతం ఇచ్చారు. అయితే, దక్షిణాదిలోని కర్ణాటకలోనూ సీపీఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటివరకూ నెరవేర్చలేదు. ఇదే తరహాలో తెలంగాణలో సీపీఎస్ నినాదంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, ఈ రెండు రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దుచేయలేదు. ఉత్తర భారతానికి ఒక రూల్.. దక్షిణ భారతానికి ఒక రూల్ ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగులు కోల్పోయిన ప్రయోజనాలు

- ఓపీఎస్ కింద ఉద్యోగి పదవీ విరమణ తరువాత ప్రతి నెలా సర్వీస్ పెన్షన్ అందేది. ఉద్యోగి రిటైర్ అయిన చివరి నెలలో ఉన్న వేతనంలో 50% వేతనాన్ని సర్వీస్ పెన్షన్ కింద ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు 2004 తర్వాత నియామకమైన వారికి సర్వీస్ పెన్షన్ అన్నదే లేదు.
- ఒకవేళ పెన్షనర్ చనిపోతే అతని భార్యకు, దివ్యాంగులైన పిల్లలు, పెండ్లికాని పిల్లలకు సర్వీస్ పెన్షన్ అందేది. కానీ, ఇప్పుడు ఆ వెసులుబాటు లేకుండా పోయింది.
- ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో 50 వేల వేతనం పొందితే, ఆ ఉద్యోగికి పాత పెన్షన్ విధానంలో నెలకు రూ.25 వేల వరకు పెన్షన్ అందేది. ఇది కుటుంబ పోషణకు, జీవిత చరమాంకంలో బాసటగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భరోసా దూరమైంది.
- ప్రభుత్వం పలు దఫాలుగా చెల్లించే డీఏ, పీఆర్సీ ఫిట్‌మెంట్లు పెన్షనర్లకు సైతం వర్తిస్తాయి. కానీ, సీపీఎస్‌లో ఇవేవీ వర్తించవు.
- సీపీఎస్‌తో పెన్షనర్లకు ప్రభుత్వంతో ఉన్న బంధం పూర్తిగా తెగిపోయింది. పెన్షన్ కోసం స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులపైనే పెన్షనర్లు ఆధారపడాల్సి వస్తున్నది. ఇది ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నది.
- రిటైర్మెంట్ తరువాత కమ్యూటేషన్ కింద ఒక ఉద్యోగికి ఓపీఎస్‌లో కొన్ని సంవత్సరాల మొత్తం పెన్షన్‌ను అడ్వాన్స్‌గా పొందే వీలుంటుంది. ఇంటిని రూమ్మణం, పిల్లల చదువులు, పెండ్లిండ్ల కోసం అడ్వాన్స్‌లు తీసుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ వెసులుబాటే లేకుండా పోయింది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

సీపీఎస్‌తో ఉద్యోగులకు తీరని నష్టం కలుగుతున్నది. పెన్షన్‌పై భరోసాలేకుండా పోతున్నది. ఈ విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఉద్యోగులంతా ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేంద్రం పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దుచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకిచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దుచేయాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. ఉద్యోగుల సహకారంతోనే తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి పలు మార్లు చెప్పారు. ఉద్యోగులు చిరకాల వాంఛను నెరవేర్చి ఉద్యోగుల మనసు గెలుచుకోవాలి.

- మారం జగదీశ్వర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఈ తెలంగాణకు ఏమైంది?

ఒకవైపు డ్రగ్స్.. మరోవైపు సారా!

- ఐదు నెలల్లోనే 1000 డ్రగ్స్ కేసులు నమోదు
- ఆరు నెల్లలో 3,380 సారా తయారీ కేసులు
- 1580 మంది అరెస్టు..
- 75 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- ట్రెకమిషనరేట్ల పరిధిలోనే డ్రగ్స్ దందా అత్యధికం

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : 'ఈ తెలంగాణకు ఏమైంది? ఒకవైపు డ్రగ్స్, మరోవైపు సారా. కొందరి పోలీసులు, ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్య ధోరణికి తప్పదు భారీ మూల్యం' అంటూ సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఆందోళనకు తగ్గట్టుగానే తెలంగాణలో డ్రగ్స్, సారా కేసులు దారుణంగా పెరిగాయి. 5 నెలల రాష్ట్ర నార్కోటిక్ బ్యూరో లెక్కలే ఇందుకు నిదర్శనం. ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా జరిపిన సోదాల్లో సుమారు రూ.100 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఐదు నెల్లలో పోలీసులు నమోదు చేసిన డ్రగ్స్ కేసులు 788 ఉండగా.. ఆరు నెల్లలో ఎక్సైజ్ సిబ్బంది నమోదు చేసినవి 200 వరకు ఉన్నాయి.

రూ.180 కోట్లకు డ్రగ్స్ అంచనా..

కేవలం ఐదు నెలల్లోనే రూ.75 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది చివరికి ఈ అంచనా విలువ సుమారు రూ.180 కోట్ల వరకు ఉండొచ్చని నార్కోటిక్ బ్యూరో అధికారులు చెబుతున్నారు. అలాగే కేసులు కూడా సుమారు 2,000 వరకు నమోదు అవ్వొచ్చని, 3,800 మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎస్టీపీఎస్ యాక్టు ప్రకారం నమోదైన కేసుల ఆధారంగా ఇప్పటి వరకు నిందితుల నుంచి రూ.47.16 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్‌లోని షాద్‌నగర్ పోలీసు స్టేషన్‌లో రూ.23 కోట్లు, గచ్చిబౌలి పీఎస్‌లో రూ.14.64 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఈ ఐదు నెలల్లో సుమారు రూ.102.41 కోట్ల విలువైన 42,190 కేజీల డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. వీటిల్లో భారీగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 26,221 కేజీల గంజాయిని ధ్వంసం చేశారు.

గుప్పుమంటున్న గుడుంబా..

బీఆర్ఎస్ హయాంలో సారా తయారీపై కేసీఆర్ ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వం మారిన వెంటనే సారా మాఫియా రెచ్చిపోయింది. ఎక్కడిక్కడే మళ్లీ తయారీ మొదలు పెట్టడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ ఎక్కడికక్కడ దాడులు మొదలుపెట్టింది. ఆగస్టు నాటికి సారాను పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది విస్తృత దాడులు చేపడుతున్నది. ఈ క్రమంలో గడిచిన ఆరు నెలల్లో 3,380 సారా తయారీదారులపై కేసు నమోదు చేసి, 16,951 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 61,739 కేజీల బెల్లం, 3,512 కేజీల పటిక, 211 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 1,159 మందిని అరెస్టు చేసి, 14,83,600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అలాగే 579 కేజీల గంజాయి, 80 గ్రాములు హషిష్ అయిల్, 1.83 కేజీల గంజాయి చాక్లెట్లు, 1 గ్రాము ఓజీ కుష్, 12.98 కేజీల పప్పి హష్కీ, 0.345 గ్రాముల ఓపీఎం, 60.23 గ్రాముల ఎండీఎంఏ, 25 ఎస్ఎస్‌డీ బ్లాట్స్, 55.3 కేజీల అల్ఫోజోలం స్వాధీనం చేసుకున్నారు. 302 మందిపై కేసులు నమోదు చేశారు.

2021 నుంచి 2024 వరకు నమోదైన డ్రగ్స్ కేసులు

సంవత్సరం	2021	2022	2023	2024 (మే)	2024 (అంచనా)
కేసులు	1331	1270	1450	788	1892
అరెస్టులు	2919	2966	2892	1580	3792
స్వాధీన డ్రగ్స్ విలువ	రూ.95.5	రూ.90	రూ.94.39	రూ.74.73	రూ.179.3

'ది కేవ్ పబ్'పై